క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

పరిగి: ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన పట్టణ కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోట్‌పల్లి మండలం బార్వల్ గ్రామానికి చెందిన అనంతయ్య, మహేందర్‌లు పరిగి పట్టణ కేంద్రంలో పసుపు పంట సాగుకోసం పసుపు కొమ్మల కొనుగోలుకు వచ్చారు. మార్కెట్‌లో ఆలస్యం కావడంతో పట్టణ కేంద్రంలోని కోర్టు వైపు వెళ్లారు. వికారాబాద్ నుంచి పరిగికి వస్తున్న ఆర్టీసీ బస్సు వారు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అనంతయ్యకు, మహేందర్‌కు గాయాలయ్యాయి. వారిని వైద్యం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతయ్య తలకు గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం వికారాబాద్‌కు తరలించారు.

నూతన భవన నిర్మాణం చేపట్టాలి

ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ గుల్షన్



మాట్లాడుతున్న గుల్షన్

కొడంగల్ రూరల్: పట్టణంలో శిథిలావస్థకు చేరిన షాదీఖానా నూతన భవన నిర్మాణం చేపట్టాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి గుల్షన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని షాదీఖానా సమీపంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త భవనం నిర్మించాలని అనేక సార్లు ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేసినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొసీడింగ్‌లు వచ్చాయని, నిధులు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నారు. కానీ పనులు మాత్రం నేటికి చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ సర్తజ్ హుస్సేన్, షేక్ రోమన్, ఎండీ.ముర్తుజా హుస్సేన్, ఎండీ.అజర్, సయ్యద్ అక్తర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి

కుల్కచర్ల ఎస్‌ఐ రమేశ్



ఆటో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎస్‌ఐ రమేశ్

కుల్కచర్ల: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సు తీసుకోవాలని కుల్కచర్ల ఎస్‌ఐ రమేశ్ పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు రోడ్డుభద్రతపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆటోలను రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ నిలపొద్దని, బస్టాండ్ ప్రాంతంలో, కేటాయించిన పార్కింగ్ స్థలాల్లోనే నిలపాలని సూచించారు. ప్రయాణికుల పట్ల ఎవ్వరూ కూడా అమర్యాదగా ప్రవర్తించొదన్నారు. ప్రతి ఒక్కరూ లైసెన్సులు పొంది ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే లైసెన్సులు రద్దు చేస్తామని, అవసరమైతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా ఈదమ్మ జాతర



పూజలందుకుంటున్న అమ్మవారు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ఈదమ్మ జాతరను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం జల్దిబిందె నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి రెట్టపట్ల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతరకు మండలంలోని చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్నాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు. ఎస్‌ఐ రవిగౌడ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోస్తు ఏర్పాటు చేశారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

కొత్తూరు: మండలంలోని ఆయా పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్‌ఐ, పీఎఫ్‌తో పాటు పలు సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సాయిబాబా పరిశ్రమల యాజమాన్యాలను శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. స్థానికంగా కొనసాగుతున్న పలు పరిశ్రమల్లో కార్మికులకు యాజమాన్యాలు కనీస వేతనాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. 12 గంటలు పనిచేయిస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తున్నట్లు ఆరోపించారు.

నేటితో ముగియనున్న కొనుగోళ్లు

- మరో 15రోజులు పొడిగించాలి
- వర్షాలతో కోతలు ఆలస్యం
- జొన్నల విక్రయానికి దళారులను ఆశ్రయిస్తే నష్టాలే
- అధికారులు చర్యలు తీసుకోవాలని రైతుల వేడుకోలు



జొన్నల కొనుగోలు కేంద్రానికి వచ్చిన వాహనాలు

మోమిన్‌పేట: మోమిన్‌పేట మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఈ నెల 31తో మూసివేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు. ఈ విషయం రైతులకు తెలియడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకో 15రోజులు పొడిగించాలని అధికారులను వేడుకుంటున్నారు. నెల రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో కోతలకు ఆలస్యమైందని పేర్కొంటున్నారు. ఇప్పటికి కొనుగోలు చేసిన జొన్నలను తాండురు డీసీఎంఎస్ గోదాంకు తరలిస్తున్నారు. 257మంది రైతుల నుంచి 10వేల బస్తాలకు పైగా కొనుగోలు చేశారు. నవాబ్‌పేట, మర్పల్లి, మోమిన్‌పేట మండలాల రైతులు ఈ కేంద్రానికే వచ్చి విక్రయించారు. దళారుల చెంతకు వెళ్లకుండా నేరుగా రైతుల ఖాతాల్లో మద్దతు ధర జమ చేస్తుండటంతో కొనుగోలు కేంద్రానికి క్యూ కడుతున్నారు. ఇంకా రైతుల వద్ద సుమారు 2వేలకు పైగా బస్తాలు నిల్వ ఉన్నాయని చెబుతున్నారు. దళారుల వద్ద విక్రయించొద్దని, కొనుగోలు కేంద్రాలో విక్రయించాలని చెప్పిన అధికారులు గడువు ముగుస్తుందని చెప్పడం బాధాకరం. రైతుల సంక్షేమం దృష్ట్యా కొనుగోలు కేంద్రాన్ని మరో 15రోజులు పొడిగించాలని కోరుతున్నారు. మార్క్‌ఫెడ్ అధికారులు ఈ విషయంలో సరైన నిర్ణయం తీసుకోవాలని వేడుకుంటున్నారు.

కేంద్రం మూసివేస్తే..

కొనుగోలు కేంద్రం మూసివేస్తే దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని దీంతో పెట్టుబడులు కూడా మిగలవని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వద్ద నుంచి చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని వేడుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాన్ని మూసివేస్తే నిరసన వ్యక్తం చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టరు స్పందించి కొనుగోలు కేంద్రాన్ని మరో 15 రోజుల వరకు పొడిగించేవిధంగా ఆదేశాలు జారీ చేయాలని పలువురు కోరుతున్నారు.

కోతలు ఆలస్యమయ్యాయి



వర్షాలు కురుస్తుండటంతో కోతలు ఆలస్యమయ్యాయి. తేమ కోసం ఎండ పెట్టేందుకు సమయం పడుతుంది. నా దగ్గర 50బస్తాలు ఉన్నాయి. మార్క్‌ఫెడ్ అధికారులు 31తో మూసివేస్తామంటే ఎక్కడికి పోయి అమ్ముకోవాలి. దళారులను ఆశ్రయిస్తే పెట్టుబడులు కూడా మిగలవు. ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలి.

– రాములు, రైతు, టేకులపల్లి

వంద బస్తాలు ఉన్నాయి



కూరగాయల పంటలు సాగు చేస్తే మార్కెట్ అస్థిరత వల్ల ధరలు ఉండకపోవచ్చని స్థిరమైన ఆదాయం కోసం జొన్న సాగు చేశా. నా లాంటి రైతులు ఇంకా చాలా మంది ఉన్నారు. వర్షాలు కురవడంతో కోతలు ఆలస్యమయ్యాయి. విక్రయించడానికి కూడా సమయం పడుతుంది. నాకు 100 బస్తాల దిగుబడి వచ్చింది. 31న మూసివేస్తే ఎక్కడికి వెళ్లి అమ్ముకోవాలి.

– నాగయ్య, రైతు, మాదిరెడ్డిపల్లి

జాతీయ రహదారిపై వర్షం నీరు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



జాతీయ రహదారిపై నిలిచిన వర్షం నీరు

కొడంగల్: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై వర్షం నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మండల పరిధిలో రావులపల్లి గ్రామంలోని జాతీయ రహదారిపై వర్షం నీరు నిలుస్తోంది. కార్లు, బస్సులు, బైక్‌లు వేగంగా వెళితే రోడ్డుపై ఆగిన వర్షం వల్ల జారుతున్నాయని చెబుతున్నారు. వేగంగా వాహనాలు వెళ్లడం వల్ల రోడ్డుపై చేరిన వర్షపు నీరు తోటి ప్రయాణికులమీద పడుతుందని చెబుతున్నారు. ఈ విషయాన్ని పట్టించుకొని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతగిరి: వికారాబాద్ పరిధిలోని సిద్దులూర్, మద్గుల్ చిట్టంపల్లి సబ్‌స్టేషన్, 11కేవీ శారద మినరల్స్ ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పూర్ణచందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

ఎస్‌ఎల్‌బీలో అతిథి పోస్టులకు ఆహ్వానం

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని సంఘం లక్ష్మిబాయి బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో అతిథి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత పాఠశాలలో తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, జనరల్ సైన్స్, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సోషల్ బోధించుటకు గాను కళాశాలలో గణితం, ఫిజిక్స్, బొటని, జువాలజీ బోధించుటకు అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జూన్ 6వ తేదీలోగా పాఠశాల మెయిల్ లేదా వాట్సాప్ ద్వారా అందజేయాలని కోరారు. మహిళ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9866559678 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



సుధాకర్

నవాబుపేట: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వ్యక్తి మృతి చెందిన సంఘటన మాదిరెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని మాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాలాపురం సుధాకర్ ప్రైవేటు ఉద్యోగి. వికారాబాద్‌లో అద్దెకు నివాసం ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం రాత్రి మోమిన్‌పేట నుంచి వికారాబాద్‌కు తన ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. మార్గమధ్యలో కొజ్జావనం పల్లి గ్రామం వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. దీన్ని గమనించిన తోటి ప్రయాణికులు కుటుంబ సభ్యులకు, 108కు సమాచారం ఇచ్చి వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ఉస్మానియాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అరుణ్ కుమార్ తెలిపారు.

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య

ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు

బంట్వారం: ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య బోధిస్తారని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం బంట్వారం మండల కేంద్రంలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యను మరింతగా పెంచి సర్కారు బడులను బలోపేతం చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చిన్న పిల్లలను చేరిఫించాలని, ప్రైవేటుకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. తల్లిదండ్రుల సహకారం ఉంటేనే నమోదు శాతం పెరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు సుధాకర్, రాంచంద్రయ్య, దేవ్యానాయక్, ఉపాధ్యాయులు ప్రభాకర్, వెంకటేశం, ప్రకాశ్ పాల్గొన్నారు.

పరిగి: ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి గోపాల్ సూచించారు. శుక్రవారం వివిధ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా బోధన చేపడుతున్నట్లు చెప్పారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయన్నారు. బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.



పరిగి: పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న గోపాల్



బంట్వారం: మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

మందకృష్ణ కృషి అభినందనీయం

ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు వెంకటేశ్

దోమ: రాష్ట్రంలో మాదిగల అభ్యున్నతికి మందకృష్ణ మాదిగ చేసిన కృషి అభినందనీయమని ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు బొంపల్లి వెంకటేశ్ పేర్కొన్నారు. ఆయనకు పద్మశ్రీ అవార్డు రావడం పట్ల ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వర్గీకరణ కోసం దశాబ్దాల కాలం పాటు ఆయన పోరాటం మరువలేనిదని తెలిపారు. సామాజిక ఉద్యమాలకు అరుదైన గౌరవం దక్కడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని వివరించారు. కేవలం హక్కుల కోసమే కాకుండా తెలుగు రాష్ట్రాలలో ఆరోగ్యశ్రీ అనే పథకం రావడానికి కారణమయ్యారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో గుండె జబ్బు ఉన్న పిల్లలకు ఉచితంగా ఆపరేషన్లు చేయించడం, దివ్యాంగులకు, వృద్ధులకు పింఛన్లు పెంపు వంటివి మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమేనని పేర్కొన్నారు. సామాజిక సమస్యలపై అనునిత్యం పోరాటం చేసిన ఉద్యమకారుడికి పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి మాదిగల పక్షాన ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

అనంతగిరి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపాట్టారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ఫారెస్టు భూముల్లో సాగులో ఉన్న పేదలకు వెంటనే పట్టాలు ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లను పార్టీలకతీతంగా లబ్ధిదారులకు మంజూరుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, సుదర్శన్, శ్రీనివాస్, చంద్రయ్య, లక్ష్మయ్య, మల్లయ్య, విజయ్, రఘురాం, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రామ మందిరం నిర్మాణానికి కృషి

ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీఎమ్మార్

తాండూరు టౌన్: తాండూరు పట్టణం ఇందిరానగర్‌లోని శ్రీరామ మందిరం పునర్నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో చేపట్టనున్న పునర్నిర్మాణ పనులను ఆలయ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో తన సహకారం ఉంటుందన్నారు. ఉదయం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీతా సంపత్ దంపతులు ఆలయ శంకుస్థాపన పనులకు శ్రీకారం చుట్టారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు పట్లోళ్ల నర్సింహులు, శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, రవిషిందే, బోయ రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయాలని ధర్నా

- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- పట్టించుకోని అధికారులు



నిరసన వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు

పరిగి: పట్టణ కేంద్రం నుంచి ఎర్రగడ్డపల్లి, నారాయణపూర్, సుల్తాన్‌నగర్ గ్రామాలకు రోడ్డు వేయాలని శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఎర్రగడ్డపల్లి కమాన్‌దగ్గర ఆయా గ్రామాల ప్రజలు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంవత్సరం క్రితం రోడ్డు మరమ్మతుల కోసం శంకుస్థాపన చేసి నేటికి పనులు ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. ఎర్రగడ్డపల్లి, సుల్తాన్‌నగర్ గ్రామాలు మున్సిపాలిటీలో ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఎందుకు రోడ్డు వేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గుంతల మయంగా మారిన రోడ్డుతో నిత్యం వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా రోడ్డు పనులు ఎందుకు చేపట్టడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన ఈ విషయంలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని సత్వరమే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో రోడ్డుకు ఇరువైపుల ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసుల రంగప్రవేశంతో నిరసన కారులు ధర్నా విరమించారు.

ధాన్యం కొనుగోలులో సర్కారు విఫలం



జుంటుపల్లిలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న శుభప్రద్‌పటేల్

యాలాల: ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని జుంటుపల్లిలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు తడిసిన ధాన్యం, మొలకెత్తిన ధాన్యాన్ని రైతులు ఆయనకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో గన్ని బ్యాగులు, తూకాలు, తరలింపు చేపట్టకపోవడంతో ఈ సమస్య తలెత్తిందన్నారు. సీఎం ఇలాఖాలో రైతులు అకాల వర్షానికి తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ధరతోనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి అందాల పోటీ మీద ఉన్న ఆసక్తి రైతాంగాన్ని ఆదుకునే విషయంలో లేదని విమర్శించారు. అనంతరం జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రైతులకు నష్టం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వరి రైతుల విషయంలో వారం లోపు ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయకపోతే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ

పీఏసీఎస్ ఛైర్మన్ సురేందర్‌రెడ్డి



యాలాల: జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న సురేందర్‌రెడ్డి తదితరులు

యాలాల: సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ చేయనున్నట్లు పీఏసీఎస్ ఛైర్మన్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శుక్రవారం సొసైటీ ఆవరణలో రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై 30 కేజీల బస్తా రూ.2,135లకే అందిస్తుందన్నారు. అవసరమున్న రైతులు క్లస్టర్ ఏఈఓల నుంచి పర్మిట్లు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్వేత రాణి, సొసైటీ సీఈఓ వేణు, ఏఈఓలు మదన్ మోహన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జీలుగతో భూసారం పెరుగుతుంది

బంట్వారం: జీలుగతో భూసారం పెరుగుతుందని వ్యవసాయ శాఖ కోట్‌పల్లి ఏఓ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బుగ్గాపూర్ రైతు వేదికలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 50 శాతం సబ్సిడీతో బంట్వారం సహకార సంఘం గోదాంలో అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు క్లస్టర్ పరిధిలోని ఏఈఓల వద్ద టోకెన్ రాయించుకోవాలన్నారు. పట్టాదారు పాసుబుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలు తప్పరినిసరిగా తీసుకువెళ్లాలని ఆయన సూచించారు.

వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు పరీక్షలు

- టీబీ జిల్లా ప్రోగ్రాం అధికారి రవీంద్రయాదవ్
- క్షయ రోగులకు ప్రతినెల రూ. వెయ్యి




మాట్లాడుతున్న రవీంద్రయాదవ్

బొంరాస్‌పేట: వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు టీబీ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని జిల్లా ప్రోగ్రామ్ అధికారి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ రవీంద్రయాదవ్ అన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం కోసం ప్రతినెల రూ. వెయ్యి ప్రభుత్వం సాయం అందజేస్తుందన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 100 రోజుల ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం మండల పరిధిలోని బురాన్‌పూర్‌లో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 109మంది అనుమానితులకు తెమడ పరీక్షలు చేశారు. రోగుల నిర్లక్ష్యం వల్లే వ్యాధి పెరిగిపోతుందని రవీంద్రయాదవ్ తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులు ఆరు నెలల పాటు మందులు వాడితే నయమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి హేమంత్ కుమార్, వైద్య బృందం రహత్, రాజు, రాజేశ్వరి, శ్రీనివాస్, ఏఎన్‌ఎం లీలావతి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగానే ధాన్యం కొనుగోళ్లు

- జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు
- నాగసమందర్ కొనుగోలు కేంద్రం పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



నాగసమందర్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మోహన్‌బాబు

ధారూరు: ధాన్యం కొనుగోలులో ఆలస్యమవుతుందనే కారణంతో అధికారులు ఆయా కేంద్రాలను పరిశీలిస్తున్నారు. గురువారం ధాన్యం కొనుగోలు కేంద్ర పరిశీలన అనే శీర్షికతో వచ్చిన వార్తకు జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు శుక్రవారం స్పందించారు. నాగసమందర్ కొనుగోలు కేంద్రంలో కిలో ధాన్యం ఎక్కువగా తూకం వేయడంపై సీసీ యాదయ్యపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నా 40కిలోల బస్తాకు కేవలం కిలోన్నర మాత్రమే తూకం వేయాలన్నారు. రెండున్నర కిలోల తూకం వేయమని ఎవరు చెప్పారంటూ ఆయన సీసీని ప్రశ్నించారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నా తీసుకోవాలని, మిల్లర్ల విషయం మేం చూసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యం కన్నా ఎక్కువ ధాన్యం వచ్చిందని, నాగసమందర్ కొనుగోలు కేంద్రం ధాన్యాన్ని దన్నారం రైస్‌మిల్లుకు పంపించినట్లు, ఇకనుంచి తాండూర్ లేదా సంగారెడ్డి రైస్‌మిల్లుకు పంపించాలని మోహన్‌బాబు సీసీని ఆదేశించారు.